పాముపొడ తెగులుతో రైతుల్లో గుబులు

- తక్షణ చర్యలు తీసుకోవాలి
- లేదంటే పంటకు తీవ్ర నష్టం
- వ్యవసాయాధికారుల సూచనలు



కాజులూరులో పాముపొడ తెగులు సోకిన పొలం

కాజులూరు: వరిపంటలపై తెగుళ్ల ఉధృతి రైతన్నలను కలవరపెడుతున్నాయి. నిన్న, మొన్నటివరకు నియోజకవర్గ గ్రామాల్లోని వరిపొలాల్లో ఎక్కువగా జింకు ధాతు లోపం, ఉల్లికోడు వంటి తెగుళ్లు వ్యాపించగా రైతులు ఖరీదైన మందులు చల్లి దాదాపు వాటిని అదుపులోకి తీసుకువచ్చారు. అయితే ప్రస్తుతం ఎక్కువగా వరిపంటపై పాముపొడ తెగులు సోకిందని రైతులు చెబుతున్నారు. నియోజకవర్గంలో ప్రస్తుత ఖరీఫ్‌లో 53 వేల ఎకరాల్లో వరి సాగవుతుండగా సుమారు 20 శాతం పొలాల్లో పాముపొడ తెగులు లక్షణాలు కనిపిస్తున్నాయి. ఈ తెగులు ముందుగా ఆకు తొడిమపై నీటిలో నానిన మచ్చలు మాదిరిగా కనిపిస్తుందని అనంతరం ఈ మచ్చలు పెద్దవై తొడిమలపై నుంచి ఆకులపై వ్యాపిస్తున్నాయని క్రమేపీ మొక్క ఎండిపోయినట్టుగా మారి చనిపోతుందని రైతులు చెబుతున్నారు. ఆకులపై ఏర్పడిన మచ్చలు ఒకదానికొకటి కలసిపోవడం వల్ల వరి మొక్క ఎండిపోయి నష్టం కలుగుతుందటున్నారు. ప్రస్తుత వాతావరణంలో మార్పులు, అధిక ఉష్ణోగ్రత, అంతలోనే ఆకాశం మేఘావృతమై చెదురుమదురు చినుకులు పడుతున్న కారణంగా వరిపంటలో పాముపొడతెగులు సోకేందుకు అవకాశం ఎక్కువగా ఉందని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ తెలిపారు. ఈ తెగులు నివారణకు ప్రొపికొనోజోల్ మందును 200 మిల్లీ లీటర్లు లేదా హెక్సాకొనజోల్ 400 మిల్లీ లీటర్ల మందును 200 లీటర్ల నీటికి కలిపి ఎకరా పంటపై పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిపంటలో పాముపొడ సోకేందుకు అవకాశం ఎక్కువగా ఉదని రైతులు ఎప్పటికప్పుడు పంటను పరిశీలిస్తూ తెగులు లక్షణాలు కనిపిస్తే స్థానిక ఆర్‌బీకేల్లో వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

గుర్తించిన వెంటనే చర్యలు చేపట్టాలి



పాముపొడ తెగులును గుర్తించిన వెంటనే నివారించకుంటే నష్టం అధికమౌతుంది. మందులకు ఎక్కువ డబ్బు ఖర్చవుతుంది. పొడ పాము మాదిరి వరిమొక్క ఆకులపై ఏర్పడిన మచ్చల వలనే పొడపాము తెగులు అని పేరొచ్చింది.

– రాయుడు నూకరాజు, రైతు, గొల్లపాలెం

నష్ట తీవ్రత పెరుగుతుంది



వరి పంటపై సోకిన తెగుళ్లను సకాలంలో నివారించకుంటే నష్టతీవ్రత ఎక్కువవుతుంది. తెగుళ్ల లక్షణాలను గమనించిన వెంటనే ఆర్‌బీకేలను లేదా మండల వ్యవసాయశాఖ కార్యాలయాన్ని సంప్రదించినట్లయితే వారు తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

– కుడుపూడి నాగేశ్వరరావు, రైతు, చేదువాడ

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



భీమేశ్వరాలయంలో చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

రామచంద్రపురం రూరల్: దసరా మహోత్సవాల్లో భాగంగా ద్రాక్షారామ భీమేశ్వరాయంలో మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా గురువారం అమలాపురం మంజీరా నాట్యాలయం వారిచే ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. నాట్యాచార్య పిల్లి దుర్గారావు శిష్యులు 20 మంది చిన్నారులు తమ నాట్య విన్యాసాలతో ఆహూతులను కట్టిపడేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి, దాతలు సత్తి సుబ్బారెడ్డి, సత్తి సత్తిరెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అమ్మఒడి పేరిట ఫ్రాడ్ కాల్స్

మండపేట: అమ్మఒడి సొమ్ములు ఖాతాకు జమ చేస్తామంటూ వచ్చే ఫ్రాడ్ ఫోన్ కాల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఐ.రాజు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అమ్మఒడి రాని లబ్ధిదారులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. మీకు అమ్మఒడి సొమ్ములు విడుదలయ్యాయని, ఓటీపీ చెప్పాలని కోరుతారన్నారు. డబ్బులు వేస్తారని ఆశపడి వారు అడిగిన వివరాలు చెప్పగానే బ్యాంకు అకౌంట్‌లో ఉన్న నగద మొత్తాన్ని కాజేస్తారన్నారు. అటువంటి ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండి ఏ విధమైన సమాచారం తెలపరాదన్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఏదైనా అప్ డేట్ ఉంటే వలంటీర్లు వచ్చి తెలియజేస్తారని ఆయన తెలిపారు. ఇటువంటి సంఘటనలు ఎదురైనపుడు వెంటనే దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎంపీడీఓ రాజు సూచించారు.

నేడు జగనన్నకు చెబుదాం

కె.గంగవరం: మండల ఎంపీడీఓ కార్యాలయంలో నేడు జగనన్నకు చెబుదాం (పబ్లిక్ గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సమక్షంలో ఈ కార్యక్రమం జరుగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఇప్పటివరకు వచ్చిన జగనన్నకు చెబుదాం దరఖాస్తులపై సమగ్ర నివేదికతో హాజరు కావాలని ఆయన కోరారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కోట గ్రామంలో 1, కుందూరులో 1, సుందరపల్లిలో 1, యండగండిలో 1, యర్రపోతవరం 1 వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి గల అభ్యర్థులు నేటి నుంచి 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహించి పోస్టింగ్ ఇస్తామని తెలిపారు.

నేడు కుడుపూరులో గడప గడపకూ..

రామచంద్రపురం రూరల్: నేటి మధ్యాహ్నం 3 గంటలకు కె.గంగవరం మండలం కుడుపూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొంటారని మంత్రి అడిషనల్ పీఏస్ పి.తేజేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు పట్టణంలో గుడ్ మార్నింగ్ రామచంద్రపురం కార్యక్రమం, 10 గంటలకు కె.గంగవరం మండలం బాలాంత్రంలో జగనన్న సురక్ష కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

రామచంద్రపురం రూరల్: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల అయినట్లు ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చోడవరం-1, ద్రాక్షారామ-1, జగన్నాయకులపాలెం-1, మాలపాడు-1, తాడిపల్లి-2, తాళ్లపొలం-1, వెలంపాలెం-1, వెల్ల-2 ఖాళీలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన వారై ఉండి పదో తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం: విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం మండలంలో ఊబలంక, రావులపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రవికుమార్ గురువారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేశారన్నారు. ఊబలంక, రావులపాలెం, కొమరాజులంక, రావులపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురం ఫీడర్ పరిధిలోని క్రాప, క్రాప చింతలపూడి, కె.జగన్నాథపురం, పోతుకుర్రు గ్రామాలకు శుక్రవారం ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాసు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ 11కేవీ లైన్‌కు అడ్డుగా వచ్చిన చెట్ల కొమ్మల కత్తిరింపు పనులు చేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఉచిత వైద్య శిబిరం

రావులపాలెం: స్థానిక సత్యసాయి సేవా కేంద్రంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హోమియో వైద్యుడు, చర్మవ్యాధుల నిపుణుడు, దంత వైద్య సేవలు ఉచితంగా చేసి మందులు పంపిణీ చేశారు.

అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- అర్తమూరులో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు



ప్రారంభోత్సవాల్లో ఎమ్మెల్సీ తోట, సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి

మండపేట: పేదల సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని అర్తమూరులో కొత్తగా నిర్మించిన సచివాలయం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, రోడ్లు, డ్రైన్లు తదితర అభివృద్ధి పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్తమూరు సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కర రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దాదాపు రూ.4 కోట్ల వ్యయంతో గ్రామంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయని, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని వివరించారు. గ్రామంలో ఆర్‌బీకే నిర్మాణానికి అడ్డుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటకు తరలించేందుకు పంచాయతీ తీర్మా నం జరగకుండా కొందరు రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. జీజీఎంపీ నిధులతో ఆ పని పూర్తిచేస్తామన్నారు. అర్తమూరులో దీర్ఘకాలంగా ఉన్న దళితుల శ్మశానవాటిక సమస్య పరిష్కార నిమిత్తం స్థల సేకరణకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్సీ తోట తెలిపారు. విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ అర్తమూరు గ్రామాభివృద్ధికి ఎమ్మెల్సీ త్రిమూర్తులు ఎంతో సహకారం అందిస్తున్నారంటూ కృతజ్ఞతలు తెలిపారు. తొలుత ఎమ్మెల్సీ తోటకు సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి దంపతులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి, ఎంపీడీఓ ఐ. రాజు, ఎంపీటీసీ సభ్యురాలు మండ సుమలత, సొసైటీ చైర్మన్ కొవ్వూరి నాగిరెడ్డి, పార్టీ నేతలు గొలుగూరి సందీప్ రెడ్డి, చిర్ల జయరామ్‌రెడ్డి, మండ నాగిరెడ్డి, నల్లమిల్లి రామచంద్రారెడ్డి, మండ వెంకటరెడ్డి, కొవ్వూరి వెంకటరెడ్డి, తేతలి భూపతిరెడ్డి పాల్గొన్నారు.

పేదలకు భారీ ఎత్తున దుప్పట్ల పంపిణీ

ఘనంగా యువ నేత పృథ్వీరాజ్ జన్మదిన వేడుకలు



ద్వారపూడిలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న పృథ్వీరాజ్ తదితరులు

మండపేట: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు, యువ నేత తోట పృథ్వీరాజ్ జన్మదిన వేడుకల సందర్భంగా గురువారం మండపేట పట్టణం, మండలంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ పట్టణ కార్యాలయం వద్ద అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకల్లో పృథ్వీరాజ్ పాల్గొని 200 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అన్నదానం కూడా చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, చోడే శ్రీకృష్ణ, సొసైటీ చైర్మన్ పెంకే గంగాధర్, శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్‌బాబా పాల్గొన్నారు.


మండలంలో

వైఎస్సార్ సీపీ ద్వారపూడి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పృథ్వీరాజ్ పాల్గొని 300 మంది పేదలకు దుప్పట్లు అందజేశారు. సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ తులా శ్రీరంగారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు దంతులూరి శ్రీరామవర్మ, మండల సేవాదళ్ కన్వీనర్ పోతుల రాంబాబు, పార్టీ నాయకులు పోతుల దుర్గాప్రసాద్, సంగిశెట్టి రమేష్, పాలినాటి సత్యనారాయణ పాల్గొన్నారు. ఏడిదలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో 200 పేదలకు పృథ్వీరాజ్ దుప్పట్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, చిలుకూరి బుజ్జి, వాసిరెడ్డి అర్జున్, రామిశెట్టి ఫణి పాల్గొన్నారు. మెర్నిపాడులో సర్పంచ్ గారపాటి సౌజన్య, పార్టీ నేత అశోక్ కుమార్ దంపతుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. మారేడుబాకలో సర్పంచ్ మట్టపర్తి గోవింద రాజులు ఆధ్వర్యంలో పేదలకు పృథ్వీరాజ్ దుస్తులు పంపిణీ చేశారు.


భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్ర మహోత్సవాలు



మహాలక్ష్మీదేవిగా ద్రాక్షారామ కన్యకాపరమేశ్వరి అమ్మవారు



మహా చండికాదేవి అవతారంలో ఆదివారపుపేట పార్వతీ అమ్మవారు



వెదురుపాక విజయదుర్గ పీఠంలో మహాలక్ష్మి రూపంలో విజయదుర్గ



సోమేశ్వరంలో ప్రత్యేక అలంకరణలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు దేవాలయాల్లో శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దక్షిణ కాశీ ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో 12వ శక్తిపీఠం మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన, సువర్ణ పుష్పార్చన తదితర పూజలు ఘనంగా జరిగాయి. మాణిక్యాంబా అమ్మవారు మహా చండీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వారణాసి కార్తికేయ బ్రహ్మత్వంలో మహాలక్ష్మీ దేవి అమ్మవారి అవతారంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు అలరించారు. ఆదివారపుపేట శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో పార్వతీ అమ్మవారు మహా చండికాదేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకుడు బోండు బాల బ్రహ్మత్వంలో పూజలు నిర్వహించారు.

దుర్గమ్మకు కుంకుమార్చన

కాజులూరు: నవరాత్ర ఉత్సవాలలో భాగంగా గొల్లపాలెం కృష్ణుని ఆలయం గురువారం రాత్రి దుర్గమ్మ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, పడిపూజ తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వేదపండితుడు బాదంపూడి నాగవెంకటసుబ్రహ్మణ్యం (పండుస్వామి) స్వచ్ఛందంగా నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో పలువురు పురోహితులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి మంది భవానీ దీక్షాపరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి సామూహిక లక్షకుంకుమార్చన నిర్వహించారు. అనంతరం పడిపూజలో భాగంగా అమ్మవారి ప్రత్యేక పాటలతో భజనులు నిర్వహించి కదం తొక్కారు. కార్యక్రమాల్లో పాల్గొన్న భవానీలకు, భక్తులకు పండుస్వామి అల్పాహారం వితరణ చేశారు.

మహాలక్ష్మిగా విజయదుర్గ అమ్మవారు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో కొలువైన విజయదుర్గ అమ్మవారు గురువారం మహాలక్ష్మీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. చీమలకొండ వీరావధాని, శ్రీనివాస్, కోట లక్ష్మీనారాయణ, నాగేంద్రశర్మ అర్చకత్వంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి ఏకవార రుద్రాభిషేకం, అన్నపూర్ణా అష్టోత్తరంతో కుంకుమ పూజలు, నవగ్రహ హోమం నిర్వహించారు. పీఠంలో భక్తులు కలశాలు ఏర్పాటు చేసుకుని సామూహిక కుంకుమ పూజలు చేశారు. గోపూజ కూడా చేశారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్(బాబి) ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. అలాగే రాయవరంలోని పార్వతీ సమేత రాజేశ్వరస్వామి, సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి, వెంటూరులోని ఉమా సమేత సోమేశ్వరస్వామి, చెల్లూరులోని అగస్థేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

శుభాలనిచ్చే శక్తి స్వరూపిణి..

సకల శుభాలను ఇచ్చే శక్తి స్వరూపిణి అయిన విజయ దుర్గా అమ్మవారిని మంచి మనస్సుతో కొలిచే వారికి సకల శుభాలు కలుగుతాయని వెదురుపాక విజయ దుర్గ పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) భక్తులకు ఉద్బోధించారు. మంచి మనస్సుతో చేపట్టే ఏ కార్యక్రమమైనా విజయం సాధిస్తుందన్నారు. పీఠాధిపతి గాడ్ భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. దేవీభాగవతం, మహాలక్ష్మీ అవతారం గొప్పదనాన్ని, గురువు ప్రాముఖ్యత, ప్రాధాన్యతను భక్తులకు వివరించారు.



అంగర వేణుగోపాలస్వామి ఆలయంలో హోమం చేస్తున్న పండితులు

కపిలేశ్వరపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ శిబిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అంగరలోని శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో పెద్దింటి మురళీ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో హోమ పూజలు చేశారు. అద్దంకివారిలంక, కేదారిలంక, వాకతిప్ప, నాగులచెరువు, మాచర, టేకి, కోరుమిల్లి తదితర గ్రామాల్లోని శిబిరాల్లో భక్తులు పూజలు చేశారు. అమ్మవారిని విశేషంగా అలంకరించారు.

రైతులకు ఈ-కేవైసీ పూర్తి

రామచంద్రపురం రూరల్: మండలంలోని రైతుల్లో 98 శాతం మందికి ఈ-కేవైసీ పూర్తి చేసినట్లు మండల వ్యవసాయాధికారి ఎస్.సత్యప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 12,884 మంది రైతులకు సంబంధించి 18,305 ఎకరాల్లో క్రాప్ బుకింగ్ చేశామన్నారు. 19వ తేదీ నాటికి 12,330 మంది రైతులు ఈ-కేవైసీ చేయించుకున్నారన్నారు.

అర్హులందరి ఇంటికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- కేశవరంలో గడప గడపకూ..



కేశవరం వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట, చిత్రంలో పాపారాయుడు, వెంకన్నబాబు, ఎంపీపీ శ్రీనివాసు

మండపేట: సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అర్హత కలిగిన ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలను చేరవేస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ప్రజారంజక పాలనను కొనసాగించేందుకు వచ్చే ఎన్నికల్లో మరలా జగన్‌ను సీఎం చేసుకోవాల్సిన బాధ్యత అందిరిపై ఉందన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణమూర్తి తదితరులతో కలిసి కేశవరంలో పర్యటించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి వీధి, బీసీ పేట, మట్టావారి సెంటర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి స్థానికులతో మాట్లాడారు. నాలుగున్నరేళ్ల జగన్ పాలనలో ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఇంకా వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తన దృష్టికి తెచ్చిన సమస్యలపై ఎంపీడీఓ ఐ.రాజు, ఈఓ సుబ్బారావులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. పర్యటనలో భాగంగా తమ ప్రాంతానికి విచ్చేసిన ఎమ్మెల్సీ తోటకు స్థానికులు సాదరంగా స్వాగతం పలికారు.ఎంపీటీసీ సభ్యులు అన్నందేవుల కృష్ణారావు, చంద్రమళ్ల పోతురాజు, సొసైటీ చైర్మన్ ముక్కపాటి శ్రీనివాస్, పెదపాటి ఉమామహేశ్వరరావు, సమతం పాపారావు, వార్డు సభ్యులు అల్లంపల్లి కిషోర్, గండిమేను గోవిందు, చుక్కా సింహాచలం, ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడు కొల్లి సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు తుపాకుల ప్రసన్నకుమార్, సూరిబాబు, గణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం

- ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు
- పలు గ్రామాల్లో సురక్ష వైద్య శిబిరాలు



పసలపూడి శిబిరంలో గర్భిణులకు సీమంతాల వేడుకలో వైఎస్సార్ సీపీ యువనేత పృథ్వీరాజ్



కోలంకలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్‌లను పంపిణీ చేస్తున్న వైద్యులు, నాయకులు

రాయవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు దేశానికే ఆదర్శంగా మారాయని వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. మండలంలోని పసలపూడిలో గురువారం సర్పంచ్ కడలి పద్మావతి ఆధ్వర్యంలో సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య నిపుణులు సీహెచ్ రమ్యశ్రీ , డీవీ సత్యనారాయణరెడ్డి, ఎం.శ్రీనివాస్, వి.సాయిరామ్ తదితరులు శిబిరానికి హాజరైన 564 మందికి వైద్య సేవలు అందించారు. అలాగే వైద్య శిబిరానికి వచ్చిన గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి, పార్టీ నేతలు నల్లమిల్లి వెంకటరెడ్డి, పోతంశెట్టి సత్తిబాబు, ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి, పంచాయతీ విస్తరణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సీడీపీవో ఎ.గజలక్ష్మి పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: నల్లూరులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వివిధ ఆరోగ్య సమస్యలకు సంబంధించి 515 మందికి పరీక్షలు చేశారు. అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యులు గవర శ్రీదుర్గ, డా.కరుణేంద్రకుమారి, సర్పంచ్ కురుపూడి ఉదయశ్రీ, మండల సాగు సలహామండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు శిబిరంలో సేవలను వీక్షించారు. 279 మంది మహిళలు, 236 మంది పురుషులకు పరీక్షలు చేశారు. చిన్నారుల సమస్యలపై నలుగురు, గర్భకోశ 02, గర్భిణులు 02, జనరల్ సర్జరీ 16, కంటి 140, ఎముక 70, ఇఎన్‌టి 37, బీపీ, సుగరు వంటి జనరల్ మెడిసిన్ 227, ఇతరల ఆరోగ్య సమస్యలకు సంబంధించి 17 మందిని పరీక్షించారు. ఇద్దరికి మెరుగైన పరీక్షలు చేయించాలని నిర్ణయించారు. ఒకరికి కళ్ళజోడు ఉచితంగా ఇచ్చారు. శిబిరంలో పలు ఆసుపత్రుల వైద్య నిపుణులైన గవర శ్రీదుర్గ, జీవీ గీతాంజలి, ఈఎన్‌టీ నిపుణులు అర్షతునీషా, ఆర్థోపెడిక్ వర్మతరుణ్‌లు సేవలందించారు. శిబిరాన్ని జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి సందర్శించారు. ఐసీడీఎస్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి పర్యవేక్షణలో అంగన్వాడీల ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్స్ ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కురుపూడి భువనేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు మార్ని పూసబ్బు, కురుపూడి రాంబాబు, కార్యదర్శి సుధారాణి, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాజులూరు: రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్య భద్రతకు సీఎం జగన్ ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష భరోసాగా నిలుస్తుందని ఎంపీపీ మాత భారతి అన్నారు. మండలంలోని కోలంకలో అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. దుగ్గుదుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి వై సుప్రియ ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన డాక్టర్లు డి సురేష్, ఎం అజయ్‌కుమార్, జి స్వాతి, వై సుప్రియ, ఎస్ సౌజన్య, సురేఖ తదితర నిపుణులైన వైద్యులు పాల్గొని 490 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ సీఎం జగనన్న పేద, మధ్య తరగతి ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు పలు పథకాలను రూపొందించారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నిపుణులైన వైద్యులతో పౌరులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగు చికిత్స నందించటంతో పాటు ప్రజలకు ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పంపన పద్మావతి, మండల సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల కమిటీ కన్వీనర్ చింతపల్లి నాగేంద్రప్రసాద్, ఎల్ సత్యనారాయణ, వైద్యసిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని వేగాయమ్మపేటలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 316 మందికి వైద్య సేవలు అందించారు. గ్రామ సర్పంచ్ అంబటి తుకారం, పీఏసీఎస్ చైర్మన్ మేకా జానకి రామయ్య, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గెద్దాడ సుబ్రహ్మణ్యంలు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు డాక్టర్ ఎస్.ప్రశాంతి, డాక్టర్ ప్రతాప్, కిమ్స్ వైద్యులు డాక్టర్ లిథియా, డాక్టర్ ఆనంద్, కంటి వైద్య నిపుణుడు ధర్మవరపు కోటేశ్వరరావులు గ్రామస్తులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కుడుపూడి రమణ, గుండుపల్లి శ్రీరాములు, కట్టా రమేష్, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు శిక్షణ తరగతులు

రామచంద్రపురం: ఏపీపీటీడీ యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులకు శిక్షణ తరగతులు రామచంద్రపురంలో డాక్టర్ చెలికాని రామారావు భవన్‌లో గురువారం నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగులకు వర్తించే ప్రభుత్వ కాండక్ట్, సీసీఏ రూల్స్, వృత్తిపరమైన సమస్యలు ఎదుర్కోవడం, యూనియన్ కార్యకర్తల పనితీరు మెరుగుపరుచుకోవడం, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై రెండు రోజుల శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులను ప్రముఖ సీనియర్ కమ్యూనిస్టు నాయకులు డాక్టర్ చెలికాని స్టాలిన్ అరుణ పతాకం ఎగురవేసి ప్రారంభోపన్యాసం చేసి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు వృత్తిపరమైన శిక్షణతో పాటు రాజకీయ పరిస్థితులపై అవగాహన కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో దేశంలో అంతర్జాతీయంగా ఉన్నటువంటి రాజకీయ అంశాలను వివరించి యూనియన్ సభ్యులు పోరాటాల వైపు కొనసాగాలని సూచించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కేఎస్‌పీ రావు యూనియన్ సభ్యులు క్షేత్రస్థాయిలో ఏ విధంగా నిర్మాణాత్మకంగా పనిచేయాలో వివరించారు. పంచాయతీరాజ్ శాఖ డివిజనల్ ఆఫీసర్ ఎస్.మహాలక్ష్మీ కుమార్ ఆర్టీసీ ఉద్యోగులకు ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీస్ రూల్స్ ఏ విధంగా వర్తిస్తాయో, ఎటువంటి నిబంధనలు ఉన్నాయో కార్మికులకు అవగాహన కల్పించారు యూనియన్ అధ్యక్షుడు జి.శ్రీనివాస్ ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైన తర్వాత ఉద్యోగులకు ఓల్డ్ పింఛన్ లేకపోవడం, రావాల్సిన బకాయిలు ఇవ్వకపోవడం, ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా అమలు చేయకుండా సంక్షేమాన్ని అమలు చేయకపోవడంపై ఉన్న ఇబ్బందులు వివరించారు. రెండు రోజుల కార్యక్రమంలో వివిధ పుస్తకాల పరిచయాలు, కవితలు, పాటలు నిర్వహించారు. సభను యూనియన్ గౌరవ అధ్యక్షుడు గాంధీరాజు వందన సమర్పణ చేస్తూ భవిష్యత్తులో వృత్తి, సామాజిక, రాజకీయ అంశాలపై అవగాహన కల్పించుకోవడమే కాకుండా ఆర్టీసీ ఉద్యోగులకు ఉన్నటువంటి అన్ని హక్కులను కాపాడుకోవడానికి నిరంతర పోరాటాలు కొనసాగాలన్నారు.